కుక్కల బెడద.. నిత్యం వ్యథ



- కాలనీల్లో స్వైరవిహారం
- చిన్నారులు, వృద్ధులపై మూకుమ్మడి దాడులు
- పట్టుకెళ్లాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు

చైతన్యపురి: వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న కుక్కల బెడద నానాటికి తీవ్రంగా మారింది. వీటి నియంత్రణకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసినప్పటికి క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో బస్తీలు, కాలనీలవాసులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వేకువజాము నుంచే గుంపులు గుంపులుగా కాలనీల్లో సంచరిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు ఒంటరిగా వెళ్తే మూకుమ్మడి దాడిచేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నగరంలో అంబర్‌పేట ప్రాంతంలో గతేడాది నాలుగేళ్ల బాలుడు కుక్కల దాడిలో గాయపడి మృతి చెందిన ఘటన తెలిసిందే. ఏదో ప్రాంతంలో నిత్యం ఇలాంటి ఘటనలు జరగటం సాధారణమైంది. చిన్న పిల్లలను పాఠశాలకు ఒంటరిగా పంపించాలంటే హడలిపోయే పరిస్థితి నెలకొంది.



కమలానగర్ కాలనీలో రహదారిపై స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కలు

వాహనాల కింద తిష్ట..

గడ్డిఅన్నారం డివిజన్‌లోని పలు కాలనీలలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కమలానగర్, కృష్ణవేణినగర్, ప్రగతినగర్, పీఅండ్‌టీ కాలనీ, లలితానగర్ కాలనీల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడి నుంచో తీసుకొచ్చి ఇక్కడ వదిలేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లలనే కాకుండా పెద్దలను సైతం వీధి కుక్కలు భయపెడుతున్నాయని, బైక్‌లపై వెంటపడి మరీ గాయపరుస్తున్నాయి. ఎక్కడ మీదపడి గాయపరుస్తాయో అని ఆందోళన చేందాల్సి వస్తుందంటున్నారు.

ఫిర్యాదు చేసినా ..

వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేస్తే మున్సిపల్ సిబ్బంది కాలనీలలోని కుక్కలను పట్టుకెళ్లి కొన్ని రోజుల తర్వాత మళ్లీ వదిలేసి వెళుతున్నారు. ఒక్కోసారి పట్టుకెళ్లిన వాటికన్నా వదిలేస్తున్నా వాటి సంఖ్యే ఎక్కువగా ఉంటుందని ఆయా కాలనీలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కు.ని చేసి వదిలేస్తున్నామని చెబుతున్నప్పటికి వీధి కుక్కలు వాటి పిల్లలను సైతం వెంటేసుకుని కాలనీల్లో తిష్ట వేస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఆయా కాలనీల్లో పర్యటించి వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.



బయటకు వెళ్లాలంటేనే భయంగా ఉంది

గడ్డిఅన్నారం డివిజన్ కమలానగర్ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నారులు కనిపిస్తే చాలు వెంటపడుతున్నాయి. రాత్రి వేళల్లో పెద్దలు సైతం వీధుల్లో తిరగాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డు పక్కన పార్కు చేసిన కార్ల కింద తిష్ట వేస్తూ అటుగా రాకపోకలు సాగించేక్రమంలో దాడులకు తెగబడుతున్నాయి. గుంపులుగా స్వైరవిహారం చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి.– **తులసి శ్రీనివాస్, కమలానగర్ కాలనీ**

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.23, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.15, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.19, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.25, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.40, చామగడ్డ రూ.45, మునగ రూ.55 ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

చికెన్, కోడి గుడ్ల వినియోగంపై అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: పౌల్ట్రీ బ్రీడర్స్ కో ఆర్డినేషన్ అసోసియేషన్, జాతీయ కోడిగుడ్ల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓల్డ్ అల్వాల్, బోయిన్ పల్లి, నాంపల్లి, అత్తాపూర్, సరూర్ నగర్, హయత్‌నగర్, మన్సూరాబాద్, మొయినాబాద్ ప్రాంతాల్లో 'చికెన్‌–కోడిగుడ్ల మేళా' నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్ పై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగిస్తూ చికెన్ వంటకాలు, ఉడికించిన కోడి గుడ్లను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 70 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద బర్డ్ ఫ్లూ వైరస్ చనిపోతుందని వెల్లడించారు. అలాంటిది మన భారతదేశంలో 100 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ వేడిలోనే వండుతారని, దీనివల్ల ఏ ప్రమాదం ఉండదని అవగాహన కల్పించారు.

సకాలంలో ఆస్తిపన్ను చెల్లించాలి



మాట్లాడుతున్న డీసీ తిప్పర్తి యాదయ్య

ఎల్బీనగర్: ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలని హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య తెలిపారు. శనివారం హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ఆస్తిపన్ను సమస్యల పరిష్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మార్చి 29 వరకు ప్రతి శనివారం సర్కిల్ కార్యాలయంలో ఆస్తి పన్ను సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహిస్తామని ఎలాంటి సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు. మార్చి నెల ముగిసే వరకు హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో రూ.89 కోట్లు వసూలు చేయాలని కమిషనర్‌ను ఆదేశించడం జరిగిందన్నారు. సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు రూ.50.80 కోట్లు వసూలు చేశామని మొండి బకాయిదారుల జాబితాను సిద్ధం చేసి నోటీసులు జారీ చేస్తామన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవు



ఆక్రమణాలను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

మన్సూరాబాద్: రోడ్డు, పుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య హెచ్చరించారు. సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జి ఏసీపీ శ్యాంసన్ ఆధ్వర్యంలో శనివారం బిగ్‌బజార్ నుంచి మన్సూరాబాద్ వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుందని ఇకపై రోడ్డును ఆక్రమించి దుకాణాలు, తోపుడు బండ్లు పెట్టిన జరిమానాలను విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ అక్బర్, సిబ్బంది శ్రీనివాసు, సాయి, రాజు పాల్గొన్నారు.

టింబర్ డిపోలో అగ్ని ప్రమాదం



టింబర్ డిపోలో ఎగిసి పడుతున్న మంటలు

చంపాపేట: చంపాపేట డివిజన్ మందమల్లమ్మ చౌరస్తా సమీపంలోని ఓ టింబర్ డిపోలో శుక్రవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..చంపాపేటలోని ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ సమీపంలో ఉన్న మణికంఠ టింబర్ డిపోలో అర్ధరాత్రి భారీగా పొగ రావడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.


ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న విఠల్‌రెడ్డి

ఎల్బీనగర్: వనస్థలిపురం నాగార్జున మాంటిస్సోరీ, ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాల 34వ వార్షికోత్సవాన్ని శనివారం బీఎన్‌రెడ్డినగర్‌లోని బీడీ రెడ్డి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్కుల కోసం బట్టీ పట్టే విధానం కాకుండా విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలకు తమ విద్యా సంస్థ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అనంతరం గత రెండేళ్లలో 10వ తరగతిలో 10కి10 సాధించిన 35 మంది విద్యార్థులకు రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రజనీ విఠల్‌రెడ్డి, సీఏఓ శేషరావు, సిబ్బంది రాజశేఖర్, లక్ష్మీ , శ్రీ విద్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



శ్రీరామరాజు

నాగోలు: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..బండ్లగూడ పరిధిలోని అయ్యప్ప కాలనీలో నివాసముండే నడింపల్లి శ్రీరామరాజు(72) ఈ నెల 21న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్: నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని, ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు.బీఎన్‌రెడ్డి నగర్ నగర్ డివిజన్ పరిధిలోని సాహేబ్‌నగర్ క్రాంతి యువజన సంఘం వద్ద రూ.25 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ప్రజలకు అందుబాటులో ఉండలేకపోయానని, అయినా నియోజకవర్గం అభివృద్ధికి అధికారులతో ఫోన్‌లో సంప్రదింపులు చేశానన్నారు. 118జీఓ విషయంలో ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అరవింద్‌రెడ్డి, సుమన్‌గౌడ్, అనిల్ చౌదరి, మాధవరం నర్సింహ్మారావు, సతీష్‌గౌడ్, గడ్డం మల్లేష్ , జగన్‌మోహన్, శివశంకర్, బిక్షపతి, నరేష్, నక్క వెంకట్, మనోజ్, శ్రీనివాస్, అర్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం



లక్ష్మారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డిని కలిసిన సంక్షేమ సంఘం ప్రతినిధులు

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అంటేనే అభివృద్ధి, సంక్షేమానికి రెండు కళ్ల లాంటిదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం బాధ్యుడు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్) అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని టెలిఫోన్ కాలనీ, శ్రీరామకృష్ణాపురం కాలనీ, అల్కాపురి కాలనీ, ద్వారకనగర్ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు శనివారం కాంగ్రెస్ నాయకుడు ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీల్లో సీసీ కెమెరాలు, సంక్షేమ సంఘాల భవనాలు, మహిళా సంఘం భవనాలు, సీనియర్ సిటిజన్ బిల్డింగ్స్, రోడ్లు, తదితర సమస్యల పరిష్కారానికి కెఎల్ఆర్, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డిని కలిసిశారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ.. ఆయా ప్రాంతాల్లో వేధిస్తున్న సమస్యను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్ కుమార్, యాదవ్‌రెడ్డి, సైదులు, కాలనీవాసులు సంజీవ రెడ్డి, రామరావు, వంశీ, శ్రీనివాస్, విజయ లక్ష్మీ, సుబ్బా రావ్, మధు, కృష్ణయ్య, సైదయ్య, కృష్ణ రెడ్డి, వెంకటేశ్వర్లు, అనుపమ గోపాల్, శ్యామల దేవి, మాధవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



కమ్యూనిటీహాల్ పనులు పరిశీలిస్తున్న అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం సైదాబాద్ ఎల్‌సీహెచ్ చిన్న కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ పనులను ఆమె జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎల్‌సీహెచ్ కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్‌కు విద్యుత్ తీగలు అడ్డుగా వస్తున్నాయని, ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా వాటిని పక్కకు జరపాలని విద్యుత్ అధికారులకు సూచించామన్నారు.

బ్రహ్మోత్సవాలు షురూ

బోడుప్పల్: బోడుప్పల్‌లోని భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి 27వ వార్షిక బ్రహ్మోత్సవలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటలకు స్వామివారికి అభిషేకం, 11 గంటలకు పుట్టు కమ్ముట, సాయంత్రం 5 గంటలకు గంగ తెప్పోత్సవం కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి రాసాల నర్సింగ్‌రావు తెలిపారు.

కడుపు నొప్పితో విద్యార్థిని ఆత్మహత్య



సంజన(ఫైల్)

ఉప్పల్: కడుపునొప్పి భరించలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌లోని నిక్కొండ ప్రాంతానికి చెందిన నీలా చిలుకానగర్‌లో నివాసముంటూ హోటల్‌లో పని చేస్తూ జీవనోపాధి పొందుతోంది. నీలా కుమార్తె బట్టు సంజన (15) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. కడుపునొప్పి తీవ్రంగా ఉండడంతో శనివారం స్కూల్‌కు వెళ్లలేదు. తల్లి మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చి చూడగా గడియ పెట్టి ఉంది. ఎంత కొట్టినా తీయక పోవడంతో స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

మానవ సంబంధాల విశిష్టత పిల్లలకు నేర్పించాలి



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

మలక్‌పేట: మానవ సంబంధ బాంధవ్యాల విలువ పిల్లలకు నేర్పించాల్సిన ఆవశ్యకత ఉందని శ్రీ చైతన్య స్కూల్ దిల్‌సుఖ్‌నగర్ జోన్ ఏజీఎం సతీష్ అన్నారు. మూసారంబాగ్ బ్రాంచీలో శనివారం స్మార్ట్ లీవింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యామిలీ బ్లూమ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి ఫ్యామిలీ ప్రోగ్రాం చేపట్టడంతో పిల్లలకు పెద్దలు, తల్లిదండ్రుల పట్ల ప్రేమ, ఆప్యాయత, గౌరవ మర్యాదలు పెరుగుతాయన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు పాద పూజ చేసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకట్ రెడ్డి, ప్రిన్సిపాల్ రిజ్వాన్, డీన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మహా రుద్రాభిషేకం



రుద్రాభిషేకం చేస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని శ్రీశృంగేరి జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం (శ్రీ శృంగేరి శంకరమఠం)లో సువర్ణభారతీ మహోత్సవంలో భాగంగా 1311 రుద్రములతో శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి రుద్రపారాయణ సహిత విశేష రుద్రాభిషేకం ప్రారంభించారు. గణపతి పూజ, పంచగవ్య ప్రాశనం, ఋత్విక్‌వరణ, రుద్రాభిషేకం నిర్వహించారు. మహా శివరాత్రి పురస్కరించుకొని లోక కల్యాణ కోసం రుద్ర పారాయణం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ నెల 26 వరకు ప్రతి రోజు దేవాలయంలో రుద్రపారాయణం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ బ్రాంచ్ హెడ్ కేవీ శ్రీనివాస్, కమిటీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ బంగారయ్య, సూర్యనారయణ శర్మ, గౌరి భాస్కర్, సుధాకర్ శర్మ, శోభనాద్రి, కేవీఎల్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

మిర్చి రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తా



మల్లేషం

చాదర్‌ఘాట్: వేసవి మిర్చి సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తానని హైదరాబాద్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.మల్లేషం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు అధికారులతో సమావేశంతో ఏర్పాటు చేసి మిర్చి రైతుల సమస్యలపై చర్చిస్తామన్నారు. చలివేంద్రాల ఏర్పాటు, విశ్రాంతి గదుల సౌకర్యాలపై దృష్టి పెడుతామన్నారు. మిర్చికి గిట్టుబాటు ధర విషయంలో ప్రభుత్వం ప్రతి మార్కెట్‌కు ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించిందన్నారు.

కాలనీలో గోడౌన్ నిర్మాణం ఆపాలి



నిర్మాణాన్ని అడ్డుకుంటున్న కాలనీ వాసులు

నాగోలు: నివాస సముదాయాల్లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కమర్షియల్ గోడాన్‌ను తొలగించాలని బండ్లగూడ మత్తుగూడ శ్రీ వేంకటేశ్వర కాలనీ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. వ్యవసాయ పొలంలో అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా గోడాన్‌లు నిర్మాణం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పిటికే పలుమార్లు ఈ విషయంపై పెద్దఅంబర్‌పేట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆరోపించారు. రెండు నెలల క్రితం అడ్డుకున్నామని మళ్లీ వచ్చి నిర్మాణం చేపడుతున్నారన్నారు. ఈ నిర్మాణంతో కాలనీలోకి పెద్ద, పెద్ద కంటైనర్లు వస్తున్నాయని, వాటివల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఇటీవల భారీ లారీ ఈ రోడ్డులో తిరగలేక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టడంతో భారీ నష్టం జరిగిందన్నారు.ఉన్నతాధికారులు స్పందించి గోడౌన్ నిర్మాణం ఆపాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు ప్రణీత్ రెడ్డి, అనంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ఐఎఫ్‌ఎఫ్ పనితీరు భేష్



బహుమతులతో విద్యార్థులు

చంపాపేట: సామాజిక సేవలో ఇంటర్ నేషనల్ ఫ్లేవర్ అండ్ ఫ్రాగ్రాన్సెస్(ఐఎఫ్ఎఫ్) స్వచ్ఛంద సంస్థ సేవలు భేషుగ్గా ఉన్నాయని ఆర్చ్ ఫౌండేషన్ సీఈఓ సోంకీషా కితాబునిచ్చారు. ఆర్చ్ ఫౌండేషన్ సభ్యురాలు, యురేకా క్విజ్ పోటీల కోఆర్డినేటర్ నివేదిత ఆధ్వర్యంలో శనివారం చంపాపేటలోని కిన్నెర గ్రాండ్ హోటల్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన క్విజ్ పోటీల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత రెండేళ్లుగా ఆర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉమాంగ్–జాయ్ ఆఫ్ లెర్నింగ్ ప్రాజెక్ట్ పేరిట నిర్వహిస్తున్న క్విజ్ పోటీలకు సహాయ, సహకారాలను అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులను ఇలాంటి పోటీల్లో ప్రోత్సహించటంతో వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో అద్భుతాలు సృష్టిస్తారన్నారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, కార్తీక్, నిషాంత్‌షా, సరూర్‌నగర్ ఎంఈఓ కృష్ణయ్య పాల్గొన్నారు.

పనుల ప్రారంభోత్సవాల్లో ప్రొటోకాల్ పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలలో ప్రొటోకాల్ పాటించాలని డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి అన్నారు. కర్మన్‌ఘాట్‌లోని సింధూర సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పార్టీ నాయకులు రవిముదిరాజ్, బొక్క సదానందరెడ్డితో కలిసి మాట్లాడారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి డివిజన్‌లో జరిగే ప్రతి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డికి సమాచారం ఇవ్వటమే కాకుండా ఆయన రాక కోసం ఎదురు చూసే వారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం మధుసూదన్‌రెడ్డి ఒంటెద్దు పోకడలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి సమాచారం ఇవ్వకుండా అభివృద్ధి పనులు ప్రారంభించటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఉమామహేశ్వర్, అంజిరెడ్డి, మల్లేష్‌గౌడ్, ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, రోజారెడ్డి, రమాదేవి, వసంతరెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి



సుజాతానాయక్‌ను సత్కరిస్తున్న నాయకులు

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తానని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్‌యాదవ్, కాలనీ ప్రతినిధులు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా కార్పొరేటర్ సుజాతానాయక్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న అన్ని సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని, రోడ్లు, డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారానికి నిధులు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రాహుల్‌సాగర్, లాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ , ఐలేష్‌గౌడ్, వేమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, లట్టుపల్లి రాజశేఖర్‌రెడ్డి, రాజు మహేశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.